ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు 5**
సోమవారం 13 అక్టోబరు 2025

ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో మోసం

- పేద, మధ్య తరగతి వర్గాలే టార్గెట్
- అత్యాశకు పోయి లక్షల్లో నష్టపోతున్న ప్రజలు
- మెటా ఫండ్ ప్రో యాప్ వ్యవహారంలో ముగ్గురి అరెస్ట్
- జగిత్యాల, కొడిమ్యాల పోలీస్ స్టేషన్లలో రెండు కేసులు



జగిత్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మెటా ఫండ్ ప్రో అనే క్రిప్టో కరెన్సీ స్కీమ్‌లో పెట్టుబడి పెడితే మూడింతలు లాభాలు వస్తాయని ప్రజలను మోసం చేసిన వ్యవహారాలు జగిత్యాలలో వెలుగులోకి వస్తున్నాయి. యేడాది క్రితం పలువురు వ్యక్తులు కీలకంగా వ్యవహరించి భారీగా పెట్టుబడులు పెట్టించారు. మెటా ఫండ్ ప్రో అనే యాప్‌లో పెట్టుబడి పెడితే మూడింతల లాభాలు వస్తాయని నమ్మించి మోసంచేస్తున్న ఘటనలు ఒక్కొక్కటికి బయటకు వస్తున్నాయి. ఎక్కువ మందిని స్కీమ్‌లో జాయిన్ చేస్తే భారీగా డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపి పెట్టుబడులు రాబట్టారు. ఈ వ్యవహారంలో జగిత్యాల, కొడిమ్యాల పోలీసులు ఇప్పటికే ముగ్గురు వ్యక్తులపై రెండు కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. కేసులో ఇంకా ఎవరెవరి పాత్ర ఎంత ఉందన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

● కొడిమ్యాలలో ఫిర్యాదుతో వెలుగులోకి..

కొడిమ్యాలకు చెందిన రాయనవేని వసంత, అడ్లగట్ట రమేశ్, బొల్లం రాకేశ్‌లతో మెటా మాస్క్ క్రిప్టో కరెన్సీ వ్యాలెట్ యాప్‌లో అదే గ్రామానికి చెందిన వీరబత్తిని రాజు, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, జగిత్యాలకు కస్తూరిరాకేశ్ కుమార్‌లు గత యేడాది రూ.20.50 లక్షల పెట్టుబడిని పెట్టించారు. తమ పెట్టుబడులకు సంబంధించిన వివరాలపై ఇటీవల బాధితులు అడగ్గా కొన్ని రోజుల్లో డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని నమ్మిస్తూ దాటవేసి ధోరణితో వ్యవహరించారు. దీంతో అనుమానంతో రాయనవేని వసంత కొడిమ్యాల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఈనెల 9న తిరుపతిరెడ్డి, రాజులను కొడిమ్యాల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు ఈనెల 10వ తేదీన జగిత్యాలకు చెందిన కస్తూరి రాకేశ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో రాకేశ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడి వద్ద ఒక ల్యాప్ టాప్, రూ.లక్ష నగదు, బ్యాంకు పాసుపుస్తకాలు, ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల క్రితం జగిత్యాల పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. జగిత్యాలకు చెందిన కస్తూరి రాకేశ్ యేడాది క్రితం తనను నమ్మించి ఓ యాప్‌లో పెట్టుబడి పెట్టించి రూ.85 లక్షలు మోసం చేసినట్లు పట్టణానికి చెందిన ఫజిల్ హమ్మద్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఆన్‌లైన్ దందాలో జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.వంద కోట్ల పెట్టుబడులు రాబట్టినట్లుగా ప్రచారం జరుగుతోంది.

● మొదట్లో అధిక లాభాలు చూపించి మోసం..

యేడాది క్రితం జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల్లో పేరేదైనా ఆన్‌లైన్ చైన్ దందాలన్నీ ఒకేలా పనిచేశాయి. మొదట్లో ఆకాశానికెత్తే లాభాలు చూపాయి. మెల్లాగా చైన్ దందాలో ఇరికించాయి. ఇక 'నువ్వు కూడా ఓ పది మందిని జాయిన్ చేస్తేనే నీకు లాభాలు వస్తాయి..' అనే పరిస్థితిని తీసుకువచ్చాయి. అధిక లాభాలు వస్తాయన్న అత్యాశతో కొందరు మధ్య తరగతి ప్రజలు రూ.లక్షల్లో పెట్టారు. చిన్నపాటి కిరాణా దుకాణం నడిపే వారు సైతం అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టారు. వీరితో పాటు పలువురు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, పోలీసులు సైతం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. బంగారు ఆభరణాలు, కార్లు, ప్లాట్లు అమ్ముకొని లాభాలు వస్తాయన్న ఆశతో మధ్య తరగతి కుటుంబాల వారు ఆన్‌లైన్ దందాలో పెట్టుబడులు పెట్టారు. తాజాగా వెలుగులోకి వచ్చిన వ్యవహారంలో యూబిట్ బిజినెస్‌లోని మెటా ఫండ్ వ్యాలెట్ యాప్ కారణమైంది. సమాజంలో వైట్ కాలర్‌గా గుర్తింపు ఉన్న పలువురు యూబిట్ దందాలో ఉండడమే జిల్లాలో వేగంగా విస్తరించడానికి కారణంగా మారిందన్న అభిప్రాయాలున్నాయి. పలువురు మాజీ ప్రజాప్రతినిధులు ఈ దందాను ముందుగా జిల్లాకు తీసుకువచ్చారనే ప్రచారం ఉంది. జిల్లా కేంద్రంతో పాటు దరూర్, కోరుట్ల, ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు కీలక వ్యక్తులు యూబిట్ దందాలో ప్రభావం చూపారని తెలుస్తోంది.

● విదేశీ టూర్ల పేరుతో..

ఆన్‌లైన్ వడ్డీ వ్యాపారంలో డాలర్ల రూపంలో పెట్టుబడి పెట్టించడానికి నిర్వాహకులు, ఏజెంట్లు విదేశీ టూర్ల పేరుతో పలువురిని ఆకర్షించారు. ఓ యాప్‌లో పెట్టుబడి లెక్కన దేశ విదేశాలకు టూర్లు ఆఫర్ ఇచ్చారు. రూ.90 వేలు పెడితే గోవా, రూ.5 లక్షలకు సింగాపూర్, రూ.12 లక్షలకు యూరప్ దేశాలకు టూర్లు అంటూ ....

- మిగతా 8లో

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● అశోక్ కుమార్, ఎస్పీ



జిల్లాలో చైన్ సిస్టం, ఆన్‌లైన్ వ్యాపారాలు, యాప్‌లో పెట్టుబడుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. అధిక లాభాలు వస్తాయని ఆశ చూపే వారితో అప్రమత్తంగా వ్యవహరించి సరియైన నిర్ణయం తీసుకోవాలి. యాప్‌ల పట్ల మోసాలకు గురి కాకుండా వ్యవహరించాలి.

సీపీఎస్ రద్దు కోసం కృషి చేస్తా

● జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని స్థానిక ఎల్‌జీ గార్డెన్‌లో పీఆర్‌టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘ సర్వసభ్య సమావేశం సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బోయినిపెల్లి ఆనందరావు, యాల్ల అమర్నాథ్‌రెడ్డి ల అధ్యక్షతన సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్య లను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక 30వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించిన ఘనత దక్కిందన్నారు. మరో అతిథిగా హాజరైన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు క్యాష్‌లెస్ హెల్త్ స్కీం వర్తించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోతుందని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ మాట్లాడుతూ టెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేస్తుందన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ నెలవారీగా రూ.700కోట్లు ఆర్థికశాఖ విడుదల చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కరీంనగర్ ఉపాధ్యాయ శాసనమండలికి పోటీ చేసిన అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయసమస్యల పరి ష్కారంకోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. అనం తరం కార్యక్రమంలో భాగంగా ఇటీవల పదోన్నతి పొందిన 153మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర, జిల్లా మండలాల బాధ్యులతో పాటు జిల్లా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పీసీసీ పరిశీలకులుగా జిల్లా వాసులు

- జనగామ జిల్లాకు మెట్‌పల్లి నేత అవేజ్
- మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు జగిత్యాల నాయకురాలు జ్యోతి నియామకం



అడువాల జ్యోతి



ఎండీ అవేజ్

జగిత్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుల నియామకానికి కార్యకర్తల అభిప్రాయ సేకరణ కోసం ఏఐసీసీ ప్రకటించిన పీసీసీ పరిశీలకుల జాబితాలో జగిత్యాల జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులు ఉన్నారు. పీసీసీ పరిశీలకుల జాబితాలో జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, మెట్‌పల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత ఎండీ అవేజ్‌లకు చోటు కల్పించారు. మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏఐసీసీ పరిశీలకుడిగా నరేశ్ కుమార్ వ్యవహరిస్తుండగా పీసీసీనుంచి పరిశీలకులుగా జగిత్యాలకు చెందిన అడువాల జ్యోతి లక్ష్మణ్‌తో పాటు మరో ఇరువురు నేతలు వ్యవహరిస్తున్నారు. జనగామ జిల్లా ఏఐసీసీ పరిశీలకుడిగా దేబాసిస్‌పట్నాయక్ వ్యవహరిస్తుండగా పీసీసీ పరిశీలకుడిగా మెట్‌పల్లికి చెందిన నేత ఎండీ అవేజ్‌తో మరోనలుగురు నేతలు వ్యవహరిస్తున్నారు. ఈమేరకు వీరువురు వారికి కేటాయించిన జిల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తూ క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయలను సేకరించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో డీసీసీ అధ్యక్షుల నియాకం కొరకు ఏఐసీసీ నుంచి 22మందితో పరిశీలికులను నియమించారు.

జిల్లా ఏఐసీసీ అబ్జర్వర్‌గా మాజీ ఎంపీ జయకుమార్

జగిత్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుడి నియామకం కోసం జగిత్యాల జిల్లాకు ఏఐసీసీ అబ్జర్వర్‌గా మాజీ ఎంపీ డాక్టర్ జయ కుమార్‌ను నియమించినట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇటీవల జారీ చేసిన జాబితాలో జగిత్యాల జిల్లాతో పాటు రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి జిల్లాకు ఏఐసీసీ అబ్జర్వర్‌గా సిద్దిఖీని నియమించింది. కాగా పలు కారణాల వల్ల ఆయన రాలేకపోవడంతో కాంగ్రెస్ అధిష్ఠానం జాబితాలో మార్పు చేసినట్లు తెలిసింది. జగిత్యాల జిల్లాతో పాటు పెద్దపల్లి, రామగుండం కార్పొరేషన్ ఏఐసీసీ పరిశీలకుడిగా తమిళనాడుకు చెందిన మాజీ ఎంపీ డాక్టర్ జయ కుమార్‌ను నియమించినట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి.

కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం



ఎన్నికైన సభ్యులు

జగిత్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు. పట్టణంలో జరిగిన ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ మోర సుమన్ కుమార్, ఉపాధ్యక్షులుగా కస్తూరి ప్రవీణ్, ఉరుమండ్ల మహేశ్, ప్రధాన కార్యదర్శిగా చిటికెల రామాంజనేయులు, సహాయ కార్యదర్శులుగా పొన్నగంటి సత్తీష్ కుమార్, బోజనపల్లి శ్రవణ్ కుమార్, కోశాధికారిగా దాత్రిక సంతోష్, కార్యవర్గ సభ్యులుగా సామ వెంకటరమణ, అరెల్లి చిరంజీవి, మామిడిపల్లి గణేష్‌లు ఎంపికయినట్లుగా ప్రకటించారు. కాగా అసోసియేషన్‌గా మంచాల కృష్ణను నియమిస్తూ కార్యవర్గం ఏకగ్రీవ తీర్మాణం చేసింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల టౌన్ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మల్యాల సబ్‌స్టేషన్ పరిధిలోని మల్యాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అన్నారు. అలాగే టీఆర్ నగర్ సబ్‌స్టేషన్‌లోనూ మరమ్మత్తులు చేస్తుండడంతో సోమవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పోతారం సబ్‌స్టేషన్ పరిధిలోని పోతారం, రాజారం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో దర్శనాలు కొనసాగించాలి

- బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కథలాపూర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

కథలాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు దర్శనాన్ని కొనసాగించాలని కథలాపూర్‌లో ఆదివారం బీజేపీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. భక్తుల మనోబావాలను దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదని అన్నారు. బస్టాండ్‌లో వేములవాడ- కోరుట్ల రహదారిపై ప్రభుత్వానిక వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, రాజన్నసిరిసిల్ల ఉపాధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, మండలఅధ్యక్షుడు మల్యాల మారుతి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కథలాపూర్ మహేశ్, నరెడ్డ రవి, బండ అంజయ్య, బీజేవైఎం అధ్యక్షుడు ఆరె శివ, అనిల్, రాజేశ్, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

●మేడిపల్లి: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయాన్ని అబివృద్ధి పేరుతో భక్తుల నిత్యదర్శనం రద్దు చేయవద్దని మేడిపల్లిలో బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ బొమ్మను దహనం చేశారు. ప్రభుత్వం హిందువుల మనోభావాలను దెబ్బతీసే విదంగా వ్యవరిస్తోందని అన్నారు. ఆలయం మూసివేతపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ కో కన్వీనర్ దవరధరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు చిట్యాల సురేష్, శివ కుమార్, తిరపతిరెడ్డి, ధర్మరెడ్డి, జగన్‌రెడ్డి, మ్యాకెల రాజు, హన్మడ్లు, నారాయణరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని ఆచరించాలి

- ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు

7

పర్యాటక కేంద్రం ఏర్పాటుకు మోక్షమెప్పుడో..?

- 1972లో నాగులపేట దగ్గర అరుదైన సైఫన్ నిర్మాణం
- ఇంజనీర్ రామకృష్ణం రాజు అద్భుత ప్రతిభ
- పై నుంచి వాగు నీరు.. కింది నుంచి శ్రీరాంసాగర్ నీరు

6

బీసీలపై కాంగ్రెస్‌ది కపటప్రేమ

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కపటప్రేమ చూపిస్తుందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ విమర్శించారు. జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్థి గ్రామంలో ఆదివారం మాజీ జడ్పీచైర్‌పర్సన్ దావ వసంతసురేష్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌తో బీసీ సమాజాన్ని కాంగ్రెస్ అయోమయానికి గురిచేసిందన్నారు. బీసీ కులాలలను ఆశలపల్లకిలో నెట్టి చెల్లని జీవోతో బీసీలతో చెలగాట మాడిందన్నారు. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు నాయకులుగా ఎదిగే అవకాశం పోగొట్టిందని, కేవలం రాజకీయ ప్రయోజనం కోసమే బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం వాడుకుంటుందని ఆరోపించారు. గవర్నర్, రాష్ట్రపతి దగ్గర బిల్లు పెండింగ్‌లో ఉండగా జీఓ 9తో ఎన్నికలకు ఎలా వెళ్తారని ఆమె ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ హయాంలో బీసీల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేశామని, నేడు అవన్నీ కనుమరుగైనట్లు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలోనే గురుకులాలను ఏర్పాటు చేసి కార్పోరేట్ స్థాయిలో విద్యార్థులకు విద్యను అందించారని గుర్తుచేశారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దుర్భరపరిస్థితులను విద్యార్థులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. బీసీల చైతన్యంతోనే రాజ్యాధికారం సాధ్యమని, బీసీరిజర్వేషన్ల అంశంపైన కొందరు బీసీనేతలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించడం విచారకరమన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుర్రప్రవీణ్‌గౌడ్, బీఆర్ఎస్‌నాయకులు బందెలశేఖర్, మహేష్‌గౌడ్, రాకేష్, వెంకటేష్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

జగిత్యాల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఈనెల 26న తలసేమియా బాధితుల కోసం నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని జగిత్యాల పోలీస్ స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్ కోరారు. ఆదివారం పట్టణంలోని పురానిపేట శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుల సేవా సమితి ఆద్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించనున్న మెగా రక్తదానం శిబిరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో పలువురు శ్రీనివాసులు పాల్గొన్నారు.

'సేవా కార్యక్రమాలతో సమాజంలో గుర్తింపు'

జగిత్యాల అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని పావని కంటి ఆసుపత్రిలో ఆపి, రోటరీ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో జగిత్యాల నియోజక వర్గాని కి చెందిన 18 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవ సేవనే మాదవ సేవ అని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, సొల్లు సురెందర్, సత్తి రెడ్డి, జైరాం రమేష్, మానాల వెంకటరమణ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా ప్రజావాణి

జగిత్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కొరకు సమీకృత కలెక్టరేట్‌లో ఈనెల 13వ తేదీన ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నియామకం

కొడిమ్యాల, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని పూడూర్ భావనరుషి పద్మశాలి యువజన సమితి అధ్యక్షుడిగా వీరబత్తిని భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతనకార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా వడ్లకొండ మహేష్, సెక్రెటరీగా వీరబత్తిని గంగసాగర్, వైస్ సెక్రెటరీగా రాములు ఎన్నికయ్యారు. క్యాషియర్‌గా వడ్లకొండ శివ, వైస్ క్యాషియర్‌గా వేముల శ్రీకాంత్‌లు ఎన్నికయ్యారు.

ప్రేమించి మోసం చేశాడని.. యువతి ఆత్మహత్యాయత్నం

హుజూరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ప్రేమించి మోసం చేశాడని యువతి అతని ఇంటి ముందు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా పెగడపల్లికి చెందిన యువతి హుజూరాబాద్‌కు చెందిన వినోద్ జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఇరువురు ప్రేమించుకున్నారు. ఇటీవల వినోద్ వేరే అమ్మాయిని వివాహం చేసుకుంటున్నాడని తెలుసుకున్న యువతి హుజూరాబాద్‌కు వచ్చింది. ఈ విషయంపై వినోద్‌ను నిలదీయగా, నాకు సంబంధం లేదంటూ వెళ్లిపోయాడు. దీంతో మనస్థాపానికి గురైన యువతివెంట తెచ్చుకున్న పురుగులమందు తాగింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు


తీవ్ర గాయాలపాలైన మొండయ్య గౌడ్

ధర్మారం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి జారి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలైన ఘటన కటికెనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అనపురం మొండయ్యగౌడ్ కొన్ని సంవత్సరాలుగా గీతవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం సాయంత్రం కల్లు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుండి జారిపడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్సనిమిత్తంకరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్రగాయం కావడంతో ఆసుపత్రిసిబ్బంది మెరుగైనవైద్యంకోసం హైదరాబాద్ తరలించాలని సూచించారు. దీంతో కరీంనగర్‌లోని ఓప్రవేటు ఆసుపత్రిలోచేర్చి చికిత్సఅందిస్తున్నట్లు మొండయ్యకుమారుడు మహేష్ తెలిపారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

వీణవంక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామంలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడామంత్రిత్వ శాఖ మైభారత్ ఆధ్వర్యంలో బ్లాక్‌లెవల్ కబడ్డీ, వాలీబాల్ పోటీలను జిల్లా అధికారి వెంకటరాంబాబు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో యువచైతన్య ఫ్రెండ్స్ యూత్‌క్లబ్ సభ్యులు కర్రె నాని, మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, తిరుపతి, సమ్మయ్య, సురేష్, గోపి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

- 1972లో నాగులపేట దగ్గర అరుదైన సైఫన్ నిర్మాణం
- ఇంజనీర్ రామకృష్ణం రాజు అద్భుత ప్రతిభ
- పై నుంచి వాగు నీరు.. కింది నుంచి శ్రీరాంసాగర్ నీరు
- పర్యాటక కేంద్రంపై అమలుకు నోచుకోని ప్రజాప్రతినిధుల హామీ

పర్యాటక కేంద్రం ఏర్పాటుకు మోక్షమెప్పుడో?


సైఫన్ వద్ద బయటకు వస్తున్న నీరు

కోరుట్లరూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం నాగులపేట వద్ద నిర్మించిన సైఫన్‌ను ఎప్పుడు పర్యాటక కేంద్రంగా మారుసారోనని పర్యాటకులు ఎదురు చూస్తున్నారు. 1972 లో ఈ సైఫన్‌ను రామకృష్ణంరాజు అనే ఇంజనీర్


సైఫన్ వద్ద మాయమవుతున్న నీరు

డిజైన్ చేసి నిర్మించారు. రెండు సంవత్సరాల పాటు వెయ్యి మంది కూలీలతో రాత్రింబవళ్లు ఈ కట్టడా న్ని నిర్మించడంలో రామకృష్ణంరాజు ప్రధాన పాత్ర పోషించారు. పైనుంచి వాగు, కింది నుంచి కాకతీయ కాలువ సుమారు 200 మీటర్ల పొడవున నిర్మించారు. ఇలాంటి కట్టడం ఆసియాలోనే రెండోదిగా ప్రసిద్ధి గాంచింది. దీంతో పర్యాటకులు, విద్యార్థిని, విద్యార్థులు కాకతీయ కాలువ పారే సమయంలో సందర్శనకు వస్తుంటారు.

సైఫన్ వద్ద ఇంజనీర్ విగ్రహం


ఇంజనీర్ రామకృష్ణంరాజు విగ్రహం

అద్భుత కట్టడాన్ని నిర్మించిన రామకృష్ణం రాజు నిర్మాణ సమయం లోనే మరణించడంతో స్మృతికి చిహ్నంగా ఆయన విగ్రహాన్ని ప్రాజెక్టు అధికారులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మాత్రం పర్యాటక కేంద్రంగా గుర్తించినప్పటికీ ఏవిధమైన సౌకర్యాలు కల్పించలేదు. కోరుట్ల పట్టణానికి ఏడు కిలో మీటర్ల దూరంలో నాగులపేట గ్రామం ఉంది. గ్రామ శివారులో కాకతీయ కాలువ మీది నుంచి వాగు ప్రవహిస్తుంది. గ్రామస్థుల సహకారంతో గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో సైఫన్ వద్ద పిక్నిక్‌కు వచ్చే వారి కోసం పార్కును ఏర్పాటు చేశారు. సైఫన్‌ను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు అప్పటి నుంచి ఇప్పటి వరకు రాజకీయ నాయకులు ఇస్తున్న వాగ్దానాలు వాగ్దానా లుగానే మిగిలిపోయాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి సైఫన్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలి

-మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్



కోరుట్ల మండల నాగులపేట గ్రామంలో కాకతీయ ప్రధాన కాలువపై నిర్మాణం చేసిన సైఫన్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు ఆహ్లాదాన్ని నింపాలి.

ప్రభుత్వాలు చొరవ చూపాలి

-భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, నాగులపేట



నాగులపేట గ్రామ శివారులో ఉన్న సైఫన్‌ను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి. ప్రతి ఎన్నికలకు మందు పోటీ చేసే ఎమ్మెల్యే, ఎంపీలు పర్యాటక కేంద్రంపై హామీ ఇచ్చి విస్మరిస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రామగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్లలో బాకం రాంమూర్తి ఇంట్లో చోరీ జరిగినట్లు బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల7న ఇంటి తాళం వేసి పెద్దపల్లికి వెళ్లారు. ఆదివారం తండ్రి రాజయ్య ఇంటికి వచ్చి చూసేసరికి తలుపుతెరిచి ఉండటంతో ఇంట్లోకి వెళ్ళి చూడగా గుర్తుతెలియని వ్యక్తులు బీరువా పగులగొట్టి అందులో దాదాపు 4తులాల, బంగారం రూ.96 వేలు దొంగించినట్లుగా గుర్తించారు. ఈమేరకు రాంమూర్తి ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసుకొని పోలీసు దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

జమ్మికుంట రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో వివిధ ప్రాంతాల్లో చోరీకి గురైన సెల్‌ఫోన్లను పోలీసులు ఆదివారం బాధితులకు అందజేశారు. జమ్మికుంటకు చెందిన ముక్క వేణు, వావిలాలకు చెందిన తూర్పాటి వెంకటేష్, మోత్కులగూడెంకు చెందిన దుర్గం తిరుమల సెల్‌ఫోన్లు వివిధప్రాంతాల్లో చోరీకి గురయ్యాయి. ఐఎమ్‌ఈఏ నంబర్ ఆధారంగా దొంగలను పట్టుకొని, వారినుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించినట్లు పట్టణసీఐ ఎస్ తెలిపారు.

నుస్తులాపూర్‌లో డ్రంకెన్‌డ్రైవ్

తిమ్మాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుస్తులాపూర్‌లో ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. ఈ డ్రైవ్‌లో నలుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ దొరికినట్లు ఎస్సై తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- ముగ్గురికి గాయాలు


గాయపడ్డ ప్రయాణికులు


బోల్తా పడిన ఆటో

తిమ్మాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ముందుగా వెళుతున్న ఆటోను వెనుకల నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడి అందులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన తిమ్మాపూర్ మండలకేంద్రంలో ఆర్టీఏ కార్యాలయ సమీపంలో రాజీవ్‌రహదారిపై ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ వైపు నుంచి రామకృష్ణాకాలనీవైపు వెలుతున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొంది. దీంతో ఆటో రోడ్డుపై నుంచి కిందికి దూసుకుపోయి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న రాజు, లక్ష్మి, మరొకరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎల్ఎండీ పోలీసులు తెలిపారు.

వాగు ప్రవాహంలో కొట్టుకుపోయిన యువకుడు

- రక్షించిన స్థానిక యువకులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పదిర- రామలక్ష్మణపల్లి గ్రామాల మధ్యఉన్న మానేరువాగు లో-లెవల్ కల్వర్టు పైనుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న మండల కేంద్రానికి చెందినకాసర్ల స్వామి వరద ప్రవాహానికి ఆదివారం రాత్రి కొట్టుకుపోయాడు. కాపాడండీ అంటూ కేకలు వేయడంతో అక్కడే ఉన్న పదిర గ్రామ యువకులు సహాయక చర్యలు చేపట్టారు. యువకుడిని, వాహనాన్ని అతికష్టం మీద బయటకు తీసుకువచ్చారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేటకు చెందిన స్వామి తన భార్య పిల్లలతో కలిసి బైక్‌పై సిరిసిల్ల మీదుగా తంగళ్లపల్లి మండలం రామన్నపల్లిలో తన అత్తగారింటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రామలక్ష్మణపల్లి, పదిర గ్రామాల మీదుగా స్వగ్రామానికి బయలుదేరాడు. మానేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుండడం గమనించని స్వామి వాహనంపై దాటే ప్రయత్నం చేశాడు. నీటి ఉధృతికి వాహనంతోపాటు కొట్టుకుపోయాడు. రక్షించండంటూ అరవడంతో యువకులు చేరుకుని కాపాడారు. సహాయక చర్యలు చేపడుతున్న క్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి స్వల్ప గాయాలపాలయ్యాడు. ఆయనను స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. స్వామిని కాపాడిన పదిర యువకులు రామచంద్రారెడ్డి, చెరుకు సాయి, కుమ్మరి సతీష్, శ్రీకాంత్, ఎలేందర్, అమరేందర్, కంచర్ల సతీష్, సాయిని పలువురు అభినందించారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన వేముల మల్లయ్యకుచెందిన మేక ఆదివారం విద్యుదా ఘాతంతో మృతిచెందింది. మల్లయ్య గ్రామశివారులోని బద్దె మారికుంటకు మేకలమందను మేపడానికి తీసుకెళ్లాడు. అందులోని ఒకమేక నోటికి ప్రమాదవశాత్తు విద్యుత్‌వైర్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మేకవిలువ రూ.10వేలు ఉంటుందని తెలిపాడు.

గ్రానైట్ క్వారీ ప్రమాదంలో కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైమ్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బావుపేటలోని గ్రానైట్ క్వారీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో రాజస్థాన్‌కు చెందిన కార్మికుడు సౌరబ్(20) మృతిచెందినట్లు కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. బండను ట్రాలీలో లోడింగ్ చేస్తుండగా బండ పక్కకు పడడంతో, క్రేన్‌మధ్యలో ఇరుక్కున్న సౌరబ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తోటికార్మికులు సౌరబ్‌ను బయటకు తీసి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరళిస్తుండగా మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడి సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యుత్తు స్తంభంపై నుంచి పడి కార్మికుడి మృతి


గణేష్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ముంజాల గణేష్(20) అనే కాంట్రాక్ట్ కార్మికుడు విద్యుత్తు స్తంభంపై నుంచి కిందపడి చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ముంజాల గణేష్ అప్రెంటిస్‌షిప్‌లో భాగంగా హన్మకొండలోని ఓ ప్రైవేట్ విద్యుత్తుకాంట్రాక్టు వద్ద పని చేస్తున్నాడు. పనిలో భాగంగా విద్యుత్తుస్తంభం ఎక్కగా జారీ కింద పడగా కిడ్నీలు దెబ్బతిన్నాయి. చికిత్స నిమిత్తం గణేష్‌ను హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధ రాత్రి మృతిచెందాడు. గణేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ తాపీ మేస్త్రీ మృతి

ఎలిగేడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడులో సుతారి పని చేస్తున్న జంగ్రపల్లి యోహన్(43)అనే తాపీ మేస్త్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ రామచంద్రం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం డిపాటిపల్లి గ్రామానికి చెందిన యోహన్ పదేళ్లుగా ఎలిగేడులోని దేవండ్ల శివ అనే వ్యక్తి దగ్గర తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈనెల 9న లలితపల్లిలో భవన నిర్మాణంలో భాగంగా మొదటి అంతస్తు పైన నిలబడి ప్లాస్టింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి గాయాలపాలైన అతడిని చికిత్సకోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడని పేర్కొన్నారు. మృతుడి కూతురు సంపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కారు-ద్విచక్రవాహనం ఢీ

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


శ్రీనివాస్(ఫైల్)

కోరుట్ల రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం వెంకటాపూర్ - మోహన్‌రావుపేట గ్రామాల మధ్య రహదారిపై ఆది వారం కారు-ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇల్లెందుల శ్రీనివాస్ (53) అనేవ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు, స్థానికులు తెలిపారు. గుమ్లాపూర్ గ్రామానికి చెందిన ఇల్లెందుల శ్రీనివాస్, మేడిపల్లికి చెందిన సమీపబంధువు ఇల్లెందుల సాయికృష్ణ ద్విచక్రవాహనంపై మోహన్‌రావుపేట నుంచి వెంకటాపూర్ వైపు వస్తుండగా జగిత్యాలవైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. సంఘటనలో ఇల్లెందుల శ్రీనివాస్ మృతిచెందగా సాయికృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. సాయికృష్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

పిల్లలు పుట్టడం లేదని ఒకరి ఆత్మహత్య


శంకర్(ఫైల్)

మల్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం మద్దుట్లలో సంతానం కలగడం లేదని మద్యానికి బానిసై శనివారం అర్ధరాత్రి ఉప్పు శంకర్(43) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం శంకర్‌కు ఆరు సంవత్సరాల క్రితం వివాహం కాగా సంతానం కలుగలేదు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన శంకర్ శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడి మృతి

- ధర్మపురిలో విషాదం


జగదీష్ (ఫైల్)

ధర్మపురి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మపురి పట్టణానికి చెందిన కస్తూరి జగదీష్(35) అనే పిల్లల వైద్యుడు ఆదివారం ఉదయం మృతిచెందాడు. ధర్మపురి పట్టణానికి చెందిన కాంగ్రెస్‌నాయకుడు, జగిత్యాల పంచాయతీసమితి మాజీ కోఆప్షన్ మెంబర్ కస్తూరి రాంకిషన్ పెద్దకుమారుడు జగదీష్ హైదరాబాద్‌లో పిల్లల వైద్యుడిగా సేవలు అందిస్తున్నాడు. ఆదివారం ఉదయం ర్యాపిడో బుక్ చేసుకొని వాకింగ్ కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బేగంపేట ఫ్లైఓవర్‌వద్ద ర్యాపిడోను వెనుకనుంచి లారీ ఢీకొట్టడంతో ర్యాపిడో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రంగా గాయపడిన జగదీష్‌ను యశోద ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు జగదీష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. డాక్టర్ జగదీష్ మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి ధర్మపురికి సాయంత్రం తీసుకువచ్చారు. మృతుడు జగదీష్ నిజామాబాద్ ఎంపీధర్మపురి అర్వింద్‌కు సమీపబంధువు కాగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అడవిశ్రీరాంపూర్‌లో యువకుడి ఆత్మహత్య


ఎడ్ల అజయ్(ఫైల్)

మంథని, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో ఎడ్ల అజయ్(25) అనేయువకుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎడ్ల మల్లయ్య-సునీత దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా వారిలో పెద్ద కుమారుడు అజయ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. అజయ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈమేరకు పోలీసు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుటీర పరిశ్రమలకు ఉచిత కరెంట్ ఇవ్వాలి

- విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శివుపల్లి రాజేశం

కోరుట్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కుటీర పరిశ్రమలు నిర్వహించే విశ్వకర్మలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించాలని విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శివుపల్లి రాజేశం అన్నారు. ఆదివారం కోరుట్ల పట్టణంలోని విశ్వకర్మ సంఘ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు శివుపల్లి రాజేశం పాల్గొన్నారు. ఈసందర్భంగా విశ్వకర్మ సంఘ నియోజకవర్గ ఇంచార్జుగా వెల్ది శ్రీకాంత్ చారీని ప్రకటించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశం మాట్లాడుతూ కమ్మర, వడ్రంగి కులాలకు చెందిన వారు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వం సంస్కరణలు తీసుకరావాలన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల వేణుగోపాల చారీ, జిల్లా ప్రదాన కార్యదర్శి కూనసపల్లి పడాల నరేష్, ఉపాధక్షులు పొన్నగంటి రంజిత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎండిన చెట్లతో పొంచి ఉన్న ప్రమాదం


రోడ్డుపై విరిగి పడ్డ చెట్టు కొమ్మలు

మానకొండూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చునూర్-ఊటూర్ గ్రామాల రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎండిన చెట్లతో ప్రమాదం పొంచి ఉంది. రెండు గ్రామాల మధ్య సుమారు కిలోమీటర్లు దూరం ఉంది. 30ఏళ్ల క్రితం రోడ్డుకిరువైపులా ఆర్‌అండ్‌బీ అధికారులు దురిసెన మొక్కలను నాటారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి వృక్షాలుగా తయారయ్యాయి. ప్రస్తుతం కొన్ని చెట్లు పూర్తిగా ఎండిపోయి కనిపిస్తున్నాయి. ప్రజలు వాటిని తీసుకెళ్లి వంట చెరుకుకు ఉపయోగించుకుంటున్నారు. కొన్ని ఏపుగా పెరిగి ఎండిపోయిన చెట్లు అలాగే ఉండిపోయి రోడ్డు మీద విరిగిపడుతున్నాయి. రెండు గ్రామాల ప్రజలు ఎండిపోయిన చెట్లను తొలగించాలని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఎండిపోయిన చెట్లను తొలగించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. అయితే ఇంతవరకు తొలగించలేదు.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

కథలాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం తక్కళ్లపల్లి-బొమ్మెన గ్రామాల మధ్య నాగెల్లి గంగు అనే మహిళ మెడలో నుంచి దొంగలు బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన నాగెలి గంగు అనే మహిళ తన తల్లి గారిల్లు బొమ్మెనలో జరిగిన ఓ శుభ కార్యానికి హాజరై బైక్‌పై తన భర్తతో కలిసి ఇంటికి వెళ్తోంది. తక్కళ్లపల్లి శివారులో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దొంగలు ఒక్కసారిగా మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు పలు గ్రామాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

హత్యకేసు దర్యాప్తును పారదర్శకంగా జరపాలి



మాట్లాడుతున్న చిరంజీవి కుటుంబ సభ్యులు

వైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలో కోట చిరంజీవి హత్యకేసు దర్యాప్తును పోలీస్‌శాఖ నిష్పక్షపాతంగా జరపాలని మృతుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో చిరంజీవి కుటుంబీకులు మాట్లాడారు. పోతన కాలనీ మీసేవా నిర్వహిస్తున్న చిరంజీవి భార్య 2019లో మృతిచెందినట్టు తెలిపారు. 2021లో చిరంజీవి ఇంటర్మీడియట్ క్లాస్‌మేట్ అయిన సంధ్యారాణితో పరిచయం అయిందని, అది ప్రేమకు దారితీసినట్టు పేర్కొన్నారు. సంధ్యారాణిని నమ్మిన చిరంజీవి రూ.10లక్షలు, ఐదు తులాల బంగారం, కారు ఇచ్చినట్టు తెలిపారు. తనను పెళ్లి చేసుకోవాలని చిరంజీవిని సంధ్యారాణి వేధించేదని, ఈ విషయమై పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినట్టు తెలిపారు. ఇలా ఉండగా మాట్లాడుకుందామని చెప్పి చిరంజీవిని సెంటినరీకాలనీ ఐకేపీ సెంటర్‌కు రావాలని సంధ్యారాణి బంధువులు పిలవగా చిరంజీవి అక్కడకు వెళ్లాడన్నారు. పక్కా ప్రణాళికా ప్రకారమే ఆమె కుటుంబ సభ్యులు చిరంజీవిని హత్యచేశారని ఆరోపించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించకుండా, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి హత్యచేసిన వారికి శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వంతెన రక్షణ గోడను ఢీకొట్టిన లారీ


ధ్వంసం అయిన వంతెన రక్షణగోడ

మల్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ -జగిత్యాల మార్గంలోని నూకపల్లి స్టేజిసమీపంలో గల వరద కాలువ వంతెన రక్షణగోడకు లారీ ఢీకొంది. వంతెన మొదట్లో ప్రమాదకర గుంత ఉండడం, ఎదురుగా వస్తున్న వాహనంను తప్పించే యత్నంలో లారీ వంతెన రక్షణగోడను ఢీకొనడంతో కొంతభాగం కూలిపోయింది. ఇరిగేషన్ సిబ్బంది ఘటనాస్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వంతెన రక్షణ గోడను ఢీకొనడంతో లారీ ముందు భాగం ధ్వంసం అయింది.

ట్రస్మా రాష్ట్ర కన్వీనర్‌గా సోగాని కొమురయ్య



సోగాని కొమురయ్య

కరీంనగర్ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) రాష్ట్ర కన్వీనర్‌గా కరీంనగర్ వివేకానంద విద్యాసంస్థల అధినేత సోగాని కొమురయ్య నియమితులయ్యారు. కరీంనగర్‌లో జరిగిన ట్రస్మా రాష్ట్రకార్యవర్గ సమావేశానంతరం ట్రస్మారాష్ట్ర కన్వీనర్, కో ఆర్డినేటర్‌తోపాటు కరీంనగర్, నిజామాబాద్, నిర్మల్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శి, కోశాధికారులను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్ మధుసూదన్, ఎస్ రమేశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా వివేకానంద విద్యాసంస్థల అధినేత సోగాని కొమురయ్యను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా బుచ్చిరెడ్డి, కోశాధికారిగా నగేశ్‌రెడ్డి నియమితులయ్యారు. నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా పోలపల్లి సురేందర్, ప్రధాన కార్యదర్శిగా క్రాంతి, నిర్మల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్ రెడ్డి, కోశాధికారిగా ఎం.మల్లేశ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎ.బాబురావు, ఎ.రాఘవేందర్‌రెడ్డి, ఎం.రాజును నియమించినట్లు ప్రకటించారు.



రాజన్న దర్శనాలు
ఉంటాయా.. ఉండవా..

● పొంతనలేని ప్రకటనలతో గందరగోళం..

వేములవాడ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దర్శనాలు ఉంటాయా..? ఉండవా..? అనే విషయంలో గందరగోళం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను చేపడుతోంది. భీమేశ్వర ఆలయంలో భక్తులకు దర్శనాలు, కోడెమొక్కులతోపాటు ఆర్జిత సేవలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం నుంచి రాజన్న ఆలయంలో భక్తులకు దర్శనాలు నిలిపి వేస్తారనే ప్రకటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆలయం మూసివేత ఉండదని, స్వామివారికి ఏకాంత పూజలు, నిత్య కైంకర్యాలు ఎప్పటిలాగే కొనసాగుతాయని మరో ప్రకటన వైరల్ అయ్యింది.

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కామెంట్స్

రాజన్న ఆలయంలో దర్శనాలపై స్పందించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజన్న మొక్కులను భక్తులు భీమన్నకు ఎట్లా చెల్లిస్తారని, భక్తుల మనోభావాలకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమంటూ హెచ్చరించారు.

● యథావిధిగా దర్శనాలు

రాజన్న ఆలయంలో దర్శనాలపై వైరల్ అయిన ప్రకటలతో భక్తులు ఆందోళన చెందారు. ఆదివారం దర్శనాలు యథావిధిగా కొనసాగాయి. ప్రస్తుతం దర్శనాలు కొనసాగుతున్నప్పటికి ఎప్పటివరకు కొనసాగుతాయనే దానిపై స్పష్టత లేదు.

ఆలయం ఎదుట ధర్నా, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు దర్శనాలను నిలిపివేస్తే చూస్తూ ఊరుకోబోమని బీజేపీ నాయకులు మండిపడ్డారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం రాజన్న ఆలయం ఎదుట ధర్నా చేసి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అర్బన్ మండలంలో నందికమాన్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. విషయం తెలుసుకున్న ఈవో రమాదేవి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రాజన్న ఆలయంలో దర్శనాలు కొనసాగుతున్నాయని, దర్శనాలను



దిష్టి బొమ్మ దహనం చేసి రాజన్న ఆలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

నిలిపివేయలేదన్నారు. అభివృద్ధిలో భాగంగా భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.దీంతో ధర్నాను విరమించారు.

రాజన్న భక్తుల విశ్వాసానికి అనుగుణంగా అభివృద్ధి పనులు

● అందరి సూచనలు తీసుకుంటాం
● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



విలేకరులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ రాజన్న భక్తుల విశ్వాసానికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న ఆలయ గెస్ట్‌హౌస్‌లో సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు, కలెక్టర్ హరిత, ఎస్పీ మహేష్ బి. గీతేతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆలయ విస్తరణ సమయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలు ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలు, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఇతరుల సూచనలు, సలహాలు ఇదివరకు తీసుకున్నామన్నారు. ఆలయ పిల్లర్ల కోసం లోతుగా గుంతలు తియ్యాల్సి వస్తుందని, పెద్ద యంత్రాలు వస్తాయని తెలిపారు. పనులు జరుగుతున్న సమయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భీమన్న ఆలయంలో ఆర్జిత సేవలకు ఏర్పాట్లు చేశామన్నారు. 19, 20 తేదీల్లో శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామి వస్తారని, ఆయన సలహాలు, సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరి సూచనల మేరకే భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్వామివారికి నిత్యం నిర్వహించే కైంకర్యాలు కొనసాగుతాయని తెలిపారు. ఆయన వెంట రాజన్న ఆలయ ఈవో రమాదేవి, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సిరిసిల్లలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీఎమ్మెల్యే సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడవెంకట్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లోని కార్మికభవనంలో ఆదివారం అయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్‌లను అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వం కోరుతున్నా కేంద్రప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతివార్డు స్థానం నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు సీపీఐ నాయకులు బరిలో ఉండి గెలుపొందడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజరేషన్ బిల్లును అమలు చేయడంతోపాటు రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. వేములవాడలో ఈనెల26న గుమ్మి పుల్లయ్యభవన్‌లో ఏఐటీయూసీ జిల్లా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, ఏఐటీ యూసీ జిల్లాకార్యదర్శి కడారి రాములు, అధ్యక్షుడు అజ్జవేణు, కేవీ అనసూర్య, గాజుల రాధ, రవి, అంగూరి రంజిత్, అనవేణి భూదన్న తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల

జగిత్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు ఆదివారం 5వేల క్యూసెక్కుల నీటినివిడుదల చేస్తున్నారు.ఎగువ ప్రాంతం నుంచి 6,790 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 80.053టీఎంసీల నీరునిల్వ ఉంది. ఇందులో సరస్వతీ కాలువకు 650క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200క్యూసెక్కులు విడుదల అవుతోంది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

వారసంతల్లో కనీస వసతులు ఎరువు

● కమ్యూనిటీ మరుగుదొడ్ల లేక ఇబ్బందులు

రామడుగు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న వారసంతల్లో కనీసవసతులు కరువ వడంతో చిరువ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రామడుగు మండలకేంద్రంలో కరీంనగర్-గోపాల్‌రావుపేట ప్రధాన రహదారిపై సంత నిర్వహిస్తున్నారు. అలాగే గోపాల్ రావుపేటలో సైతం వ్యవసాయ భూమికి వెళ్లే ప్రధాన రహదారిపై సంతను నిర్వహిస్తున్నారు. అలాగే షానగర్ వద్ద కూడా వారసంత నిర్వహిస్తుండగా ఎక్కడ కూడా కనీస వసతులు లేవని వ్యాపారులు, వినియోగదారులు వాపోతున్నారు. ప్రధానంగా కమ్యూనిటీ మరుగుదొడ్లు లేకపోడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి వారసంతల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని వినియోగదారులు, వ్యాపారులు కోరుతున్నారు.



రామడుగులో రోడ్డుపైనే నిర్వహిస్తున్న వారసంత

శబరిమలలో బంగారం చోరీపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : శబరిమల శ్రీధర్మశాస్తా దేవాలయంలో బంగారం చరీ, ఆస్తుల దుర్వినియోగంపై ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు నిబంధనల ఉల్లఘనపై తీవ్ర ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో కేంద్రప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్ అయ్యప్ప సేవాసమితి సభ్యులు ఆదివారం ఓ కార్యక్ర మానికి భగత్‌నగర్ అయ్యప్ప ఆలయానికి వచ్చిన కేంద్ర మంత్రిని కలిశారు. కఠిన దీక్షతో, నియమాలతో, భక్తితో అయ్యప్ప ఆలయానికి వెళతా రని, అంతటి విశిష్టత కల ఆలయంలో ఆభర ణాలు చోరీ కావడం, తప్పుడు రికార్డులు నమోదు చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా చేయడం క్షమించరాని నేరమని తెలిపారు. 1999లో ఆలయంలో ఉపయోగించిన 1.5కిలోల బంగారాన్ని రాగిగా రికార్డుచేసి ఉద్దేశ్య పూర్వకంగా దాచిపెట్టారని ఆరోపించారు. బంగారు కవచాన్ని ప్రత్యేక కమిషన్‌కు సమాచారం ఇవ్వ కుండానే ప్రైవేట్ సంస్థకు తరలించి కస్టోడియల్ ప్రొటోకాల్ ఉల్లఘనకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ విషయం వెలుగులోకి రావడం హైకోర్టు ఆదేశాలపై ఏర్పడిన సిట్ విచారణ తర్వాత మాత్రమే జరిగిందని గుర్తుచేశారు. తక్షణమే శబరిమల ఆలయ ఆస్తులపై సీబీఐ పర్యవేక్షణలో ఆడిట్ లేదా సెంట్రల్ హెరిటేజ్ ఆస్తులపై సమీక్ష జరుపాలని డిమాండ్ చేశారు. ఆస్తులను డిజిటల్ పబ్లిక్ ఇన్వెంటరీ సిస్టం ద్వారా నిర్వహిస్తూ కంట్రోలర్ ఆడిట్ జనరల్ నిర్దేశించిన ప్రమాణాలను పాటించేలా చూడాలని తెలిపారు. బాధ్యు లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆల యానికి కేంద్ర సాంస్కృతిక వారసత్వరక్షణ హోదా కల్పించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కె పరమేశ్వర్, పి సత్యనా రాయణ, జి నాగరాజు, పి సాయన్న తదత రులున్నారు.



కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

23న కొండగట్టులో తలనీలాలకు వేలం

మల్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తుల నుంచి గత ఆగస్టు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు, 2023 ఏప్రిల్ 12 నుంచి జూలై వరకు దేవస్థానం ద్వారా సేకరించి పోగుచేసి నిల్వఉంచిన తలనీలాలకు ఈనెల 23న టెండర్లు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ-టెండర్, సీల్డ్ టెండర్‌కం బహిరంగ వేలం నిర్వహంచడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకోసం 8333800721, 8333800723లో సంప్రదించాలని అన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం ఉదయం భక్తులు పెద్ద సంఖ్యలో రాజన్న ఆలయానికి తరలివచ్చారు. రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో బారులు తీరారు. అనంతరం పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు.

రాజన్నసేవలో సీఎం ఓఎస్‌డీ శ్రీనివాస్..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని సీఎం ఓఎస్‌డీ వేములశ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, వేదపండితులు ఆయనకు స్వస్తివచనంతో స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ఏఈవో రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

జాతీయస్థాయి యోగా పోటీల్లో కాంస్య పతకం

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని మైసూరులో ఈ నెల 9 నుంచి 12వరకు నిర్వహించిన 50వ జాతీయస్థాయి సీనియర్ యోగాసన పోటీలలో జిల్లాకు చెందిన పొన్నపాటి అరుణకుమారి కాంస్య పతకం సాధించారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారుపతకం సాధించిన అరుణకుమారి తెలంగాణ రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యోగా సంఘం చైర్మెన్ సర్దార్ రవీందర్‌సింగ్ అరుణకుమారిని అభినందించారు.

జాతీయ పోటీలలో కాంస్యపతకం సాధించిన ఆమె క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిందని కొనియాడారు. అరుణ కుమారిని రాష్ట్ర యోగా సంఘం ఇంచార్జి ప్రధానకార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎన్ రెడ్డి, వివిధ జిల్లాల యోగా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు అభినందిం చారు.



జాతీయ యోగా పోటీల్లో కాంస్య పతకం, ప్రశంసా పత్రం అందుకుంటున్న అరుణకుమారి

సనాతన ధర్మాన్ని ఆచరించాలి

● ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు

ధర్మపురి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని ఆచరించాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు అన్నారు. జగిత్యాలజిల్లా ధర్మపురి పుణ్యక్షేత్రంలోని శ్రీమఠం స్థలంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రవచన ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధర్మపురి గొప్ప పుణ్య క్షేత్రమని పేర్కొన్నారు. ఈ క్షేత్రంలో నిత్య నారసింహ హోమం, కుజదోష నివారణ పూజలు నిర్వహించడం వల్ల అనేకమంది దోషాలు తొలగిపోతున్నట్లు ఆయన అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని ఆయన అన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ఆధ్యాత్మికత మన జీవితానికి దిశానిర్దేశం చేస్తుందని తెలిపారు. రాష్ట్రఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ చాగంటి కోటేశ్వర్‌రావు తన ప్రవచనాల ద్వారా ధర్మపురిక్షేత్రాన్ని ప్రపంచానికి తెలియజేశారని అన్నారు. చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచనాలు విని ప్రతిఒక్కరు భక్తిమార్గంలో పయనించాలని సూచించారు. అనంతరం మంత్రి లక్ష్మణ్‌కుమార్ కొడుకు హరీశ్వర్ కుమార్ రూపొందించిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి డాక్యుమెంటరీ ప్రోమోను చాగంటి కోటేశ్వర్‌రావు ఆవిష్కరించారు. అనంతరం చాగంటి కోటేశ్వర్‌రావు, మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ సత్యప్రసాద్, మాజీమంత్రి జీవన్‌రెడ్డి, ఎస్పీ అశోక్‌కుమార్‌లను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పురాణ ప్రవచకులు బాచంపెల్లి సంతోష్ కుమార్ శర్మ, ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్ టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండలకాంగ్రెస్ అధ్యక్షుడు సంగన భట్ల దినేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు. జగిత్యాల డీఎస్పీ వెంకటరమణ పర్యవేక్షణలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వైద్యరంగంలో ఏఐది కీలకపాత్ర

● ఫిజీషియన్ల రాష్ట్ర సదస్సులో వైద్య నిపుణులు

సుభాష్‌నగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో వైద్యరంగంలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ముఖ్యపాత్ర పోషిస్తుందని ప్రముఖ వైద్యనిపుణులు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం తెలంగాణ ఫిజీషియన్ల 9వ రాష్ట్ర సదస్సు వీ కన్వెన్షన్‌లో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖవైద్యులు మాట్లాడారు. రానున్న రోజుల్లో వైద్యరంగంలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ముఖ్యభూమిక పోషిస్తుందన్నారు. డాక్టర్‌కు పేషెంట్‌తో ఎక్కువ సమయం కేటాయించవచ్చన్నారు. జిల్లా కేంద్రానికిచెందిన సీనియర్ ఫిజీషియన్లు డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ వీరారెడ్డి, డాక్టర్ విఠల్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. రెండు రోజుల పాటు ఆరగనైజింగ్ చైర్మెన్ డాక్టర్ వి తిరుపతి రావు, కార్యదర్శి డాక్టర్ విజయ్ మోహన్‌రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ చైతన్య, డాక్టర్ రఘురామన్, డాక్టర్ సురేష్, డాక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో రాష్ట్రసదస్సు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి ఫిజీషియన్ వైద్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



వేదికపై కూర్చున్న సీనియర్ ఫిజీషియన్లు

● ఊబకాయానికి మందు ఉంది
- డాక్టర్ రాకేశ్ సహాయ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్



కొన్ని సంవత్సరాలుగా మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన శైలి మూలంగా చాలా చిన్న వయస్సులోనే ఊబకాయానికి గురవుతున్నారు. ఊబకాయం వల్ల సుమారు 200రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉంది. అయితే దీనిని అదుపు చేసేందుకు మందులు అందుబాటులోకి వచ్చాయి.

● రక్తహీనతను తేలికగా తీసుకోవద్దు
- డాక్టర్ గణేష్ జై షట్వార్, హైటెక్ సిటీ యశోద హాస్పిటల్



నేడు రక్తహీతన సాధారణమైంది. 10మంది యుక్తవయస్సు ఆడపిల్లల్లో 7నుంచి 8మందికి, 10మంది పురుషుల్లో ఇద్దరి నుంచి ముగ్గురికి, చిన్నపిల్లలు కూడా రక్తహీనతతో బాధపడుతున్నారు. రక్తహీనతను తేలికగా తీసుకోవద్దు. రక్తపరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా చికిత్స తీసుకోవాలి.

● మంచి బ్యాక్టీరియాతో రోగం నయం చేయవచ్చు
- డాక్టర్ రవిశంకర్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు



మంచి బ్యాక్టీరియాతో రోగం నయం చేయవచ్చు. ఫీకల్ మైక్రో బయాలజీ టెస్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా ఆరోగ్యవంతంగా ఉన్నవ్యక్తి స్టూల్(మలం)ను తీసుకొని పేషంట్‌కు ట్రాన్స్‌ప్లాం టేషన్ చేయడం వల్ల పేషంట్‌లో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. దాంతో పేషంట్ త్వరగా కోలుకుంటాడు.

సన్మానం

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపాలిటీలో గ్రేడ్-1 శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జంగిలి మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీని యర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్‌ల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరిఅశోక్‌కుమార్ మాటా ్లడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా మెరుగైన సేవలు అందించారని కొనియాడారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు విశ్వనాథం, హన్మంతరెడ్డి, ప్రకాష్‌రావు, విఠల్ తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొడిమ్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామంలో నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి ఆదివారం ఈదూరి జమున-లక్ష్మణ్ 1116ల రూపాయలు, గడ్డమీది అనూష-భార్గవ్ 1116 రూపాయలు విరాళంగా అందించి నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో అన్నదానం

కొడిమ్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామంలో గల శ్రీ నల్ల పోచమ్మ బాల హనుమాన్ దేవాలయంలో ఆదివారం నవదుర్గా సేవా సమితి సభ్యులు గ్రామస్థులకు అన్నదానం చేశారు. అంతకుముందు ఆలయ పూజారి పోచమ్మకు, బాల హనుమాన్‌కు ప్రత్యేక పూజలు చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, హనుమాన్ సేవా సమితి సభ్యులు, నవదుర్గా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ

కొడిమ్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బండి స్వామి అనే వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, వెంకటి, రాజు, రాకేష్ తదితరులు ఉన్నారు.

ఉర్దూ భాషా పరీక్షలు

రాయికల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని మదీనా మజీద్ ఆవరణలో అబిద్ అలీ ఖాన్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుతున్న విద్యార్థులకు ఆదివారం ఉర్దూ భాషా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో 75 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో హఫీస్ మహ్మద్ సద్దాం, హఫీస్ ఇమాముద్దీన్, హఫీస్ మున్వర్, ఆఫీస్ అన్వర్, రవూఫ్, రాయికల్ సెంట్రల్ ముస్లీం కమిటీ అధ్యక్షుడు మహ్మద్ సోహెల్, ఉపాధ్యక్షులు మహ్మద్ షాకీర్, సెక్రెటరీ ముజాహిద్, తబ్లిక్ జమాత్ అధ్యక్షుడు మహ్మద్ సాబీర్, మహ్మద్ అబ్దుల్ హసమ్, మహ్మద్ జుబేర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఆపరేటర్ల కొరత

● జేఎల్ఎం, ఏఎల్ఎంలపై పనిభారం ● తరచూ విద్యుత్ సేవలకు అంతరాయం

కథలాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) వ్యవసాయ పంపుసెట్లు, గృహాలు, వ్యాపార, వాణిజ్య దుకాణాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసే సబ్‌స్టేషన్లలో ఆపరేటర్ల కొరత కారణంగా అవాంత రాలు ఏర్పడుతున్నాయి. సబ్‌స్టేషన్ ప్రతీ క్షణం పరిశీలిస్తూ ఫీడర్ల వారీగా విద్యుత్ సరఫరా చేయ డంలో ఆపరేటర్ పాత్రే కీలకంగా ఉంటుంది. ఎప్పటి కప్పుడు ఏ ఫీడర్‌కు ఎంతమేర వినియోగిస్తున్నారనేది రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఫీడర్‌లో అవాంతరాలు ఏర్పడితే వెంటనే స్థానిక జేఎల్ఎం, ఏఎల్ఎంలతో సమన్వయం చేస్తూ సత్వరమే విద్యుత్ సరఫరా చేస్తుండాలి. అయితే ఈ కీలకమైన ఆపరేటర్లు సబ్‌స్టేషన్లలో లేకపోవడంతో తరచూ విద్యుత్ సరఫరా సకాలంలో జరగని పరిస్థితి ఎదురవు తోందనే విమర్శలున్నాయి. సబ్‌స్టేషన్లలో ఆపరేటర్లను గత కొన్నేళ్ల కిందట కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఆర్టిజన్స్ పేరిట నియమించుకున్నారు. పూర్తిస్థాయిలో అన్ని సబ్‌స్టేషన్లకు నియమించలేదు.



భూషణరావుపేట విద్యుత్ సబ్‌స్టేషన్

● ఏటా పెరుగుతున్న సబ్‌స్టేషన్లు

కథలాపూర్ సెక్షన్ కింద బొమ్మెన, భూషణ రావుపేట, చింతకుంట, కథలాపూర్‌లో 33/11 కేవీ సామర్థ్యం గల సబ్‌స్టేషన్లు ఉన్నాయి. అంబారిపేట సెక్షన్‌లో గంభీర్‌పూర్, తాండ్య్రాల, అంబారిపేట గ్రామాల్లో సబ్‌స్టేషన్లు విద్యుత్ సరఫరా అందిస్తు న్నాయి. వాస్తవానికి ఒక్కో సబ్‌స్టేషన్‌లకు ముగ్గురు చొప్పున ఆపరేటర్లు ఉండాలనే నియమం ఉంది. ప్రస్తుతం ఏ సబ్‌స్టేషన్‌లో కూడా ముగ్గురు లేరు. తాండ్య్రాల, అంబారిపేటలో రెండు, భూషణ రావుపేటలో ఒకటి, బొమ్మెన, చింతకుంటలో రెండేసి చొప్పున ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ క్రమంలో జూనియర్ లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్‌లకు ఆపరేటర్ డ్యూటీలు వేసి కొనసాగి స్తున్నారు. వాస్తవానికి జెఎల్ఎం, ఏఎల్ఎంలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, తీగలను సవరించే పనులతో పాటు వ్యవసాయ మోటర్లకు సంబం ధించిన ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజులు వేయడం చేస్తుంటారు. కొత్తగా లైన్లు, స్థంబాలు వేయడం వంటి పనుల్లో నిత్యం బీజీగా ఉంటారు. ఈ పనులతో పాటు ఆపరేటర్ డ్యూటీ కూడా చేయాల్సి రావడంతో పని ఒత్తిడి పెరుగుతోందని ఏఎల్ఎం, జేఎల్ఎంలు వాపోతున్నారు. గ్రామాల్లో లోవోల్టేజి నివారణకు 25 కేవీ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తుంటారు. కాగా ప్రభుత్వం వాచ్ మెన్‌లను కూడా నియమించని కారణంగా రాత్రి వేళల్లో ఇబ్బందు పడాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. మండలంలో నూత నంగా పోసానిపేట, సిరికొండ గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మిస్తు న్నారు. ఇప్పటికే పోతారం, కలికోట గ్రామాల్లో జేఎల్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆపరేటర్లను నియమించి విద్యుత్ అంతరాయాలను తొలగించాలని పలువురు విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

ఆపరేటర్ల కొరతతో సిబ్బందికి అదనపు పనులు

-దివాకర్‌రావు, ఏఈ కథలాపూర్



ప్రతీ ఫీడర్‌కు ప్రభుత్వం నిర్ణయించిన వేళల్లో విద్యుత్ సరఫ రాను ప్రణాళిబద్ధంగా ఆప రేటర్ చేస్తుంటారు. ఉన్నతాధికారుల ఆదే శాలను పాటిస్తూ వివిధ ఫీడర్లకు విద్యుత్ అందించాల్సి ఉంటుంది. సెక్షన్‌లో 5 ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆపరేషన్ సిబ్బందికి అదనపు పనులు అప్పగించి సబ్‌స్టేషన్లు ఆపరేట్ చేయిస్తున్నాం.

ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో మోసం

(ఐదో పేజీ తరువాయి)



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్(ఫైల్)

వ్యాపారులు, యువతను ఆకర్శించారు. వందల సంఖ్యలో వ్యాపారులు, యువతను టూర్లకు తిప్పి పెట్టుబడులు పెట్టించినట్లు పలువురు బాధితులు పేర్కొంటున్నారు. జిల్లాలో ఆన్‌లైన్ వ్యాపారాల్లో మనీ లాండరింగ్, హవాలా జరిగిందన్న అనుమానాలు సైతం పలువురు వ్యక్తం చేస్తున్నారు. కొందరు హైదరాబాద్‌తో పాటు విదేశాల్లో ఉంటూ క్రిప్టో కరెన్సీ పేరిట ఫేక్ యాప్ ద్వారా దందా చేసినట్లుగా ఆరోపిస్తున్నారు. క్రిప్టో కరెన్సీ అంటూ వివిధ పేర్లతో గల యాప్‌ల ద్వారా దందాను గుట్టుగా సాగించారు. ఇందులో లాభాలు తొలుత అధికంగా కనిపించడంతో సభ్యుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీంతో జిల్లా పోలీసులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి రెండు వేర్వేరు కేసులు నమోదు చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈదందాలో కీలకంగా వ్యవహ రించిన రాకేశ్ విచారించిన పోలీసులు హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రధాన సూత్రదారి తీరును పరిశీలిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. పోలీసుల విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం కార్యవర్గం

గొల్లపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి ఆర్ఎంపీ, పీఎంపీ నూతన కార్యవర్గం ఆదివారం నియామకమైంది. సంఘం అధ్యక్షప్రధాన కార్యదర్శులు గూడ లక్ష్మీనారాయణ, శాతర్ల రవి, కోశాధికారి నూరమల్ల సతీష్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గంను నియమించారు. గౌరవ అధ్యక్షులుగా సాయిని నరహరి (చెందోళి), ఉపాధ్యక్షులుగా పిట్టల శ్రీనివాస్ (రాఘవ పట్నం), ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ఇండ్ల రాజేశం (గోవిందు పల్లె), అధికార ప్రతినిధిగా గన్నేరువరం రాజయ్య (శ్రీరాముల పల్లె), కార్యనిర్వహణ కార్యదర్శిగా సామల సంతోష్ కుమార్-(చెందోళి), సంయుక్త కార్యదర్శిగా సూదుల మునీందర్ (శ్రీరాముల పల్లె), సంయుక్త కార్యదర్శిగా నరడిగ రాఘవేంద్ర (అగ్గిమల్ల), సంయక్త ప్రధాన కార్యదర్శిగా ముద్దం చంద్రశేఖర్ (వెన్నుమట్ల), గడుగు విజయ్ (రాపల్లె), సలహాదారులుగా ఎం. ఏ. అక్రమ్, ఉల్లెంగుల రాజమౌళి, నుంకె మల్లేశం, మామిడాల రాజు, గుండ తిరుపతి, బచ్చల శంకర్ నియమితులయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ

పెగడపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలో కాంగ్రెస్ బాకీ కార్డులను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి రెండేళ్లవుతున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, రాజేశ్వర్ రావు, గాజుల గంగాధర్, వెంకటేశం, శ్రీనివాస్, తిరుపతి, సత్యనారాయణరావు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్య సేవలు అభినందనీయం

-మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో మిలాత్ ఇస్లామియ కమిటీ సభ్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. శిబిరంలో పలు వార్డులకు చెందిన రోగులకు వైద్యులు ఉచితంగా సేవలు అందించారు. వైద్య సేవలు అందించిన వైద్యులకు జ్ఞాపికలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విదంగా కేవలం తెలుగు రాష్ట్రాల్లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హాయంలో ఆరోగ్య శ్రీ సేవలు ప్రారంభించడం జరిగిందన్నారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో సైతం ఎలాంటి ఆర్థిక బారం లేకుండా ఆరోగ్య శ్రీ వైద్య సేవలు పొందగలిగే విదంగా పథకాన్ని ప్రారంభించారన్నారు. నిరుపేదలు ఆరోగ్య శ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రజలకు సేవలు అందించడం హర్షనీయమన్నారు. ఈకార్యక్రమంలో పలువురు వైద్యులు, మిలాత్ ఇస్లామియ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో ఆధ్యాత్మికవేత్త 'చాగంటి'

ధర్మపురి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు దంపతులు ఆదివారం సందర్శించారు. ఆలయ గోపురం వద్ద ఆయనకు మంగళ వాయిద్యాలు వెంట రాగా ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, వేదపండితులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ధ్వజ స్తంభం వద్ద మొక్కుకుని, స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో చాగంటి దంపతులను ఘనంగా ఆశీర్వదించారు. చాగంటి కోటేశ్వర్‌రావును మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్వామి శేష వస్త్రం కప్పి సత్కరించారు. అంతకు ముందు చాగంటి కోటేశ్వర్‌రావు యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కూడా తన కొడుకుతో కలిసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. స్థానిక బ్రాహ్మణ సంఘం పక్షాన చాగంటి కోటేశ్వర్‌రావును అధ్యక్షులు ఇందారపు రామయ్య, కార్యదర్శి నందగిరి గిరిధర్ సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు

'క్షేత్రాభివృద్ధికి మంత్రి అడ్లూరి కృషి'

ధర్మపురి క్షేత్రాభివృద్ధి కోసం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆయన కొడుకు హరీశ్వర్‌కుమార్ విశేషమైన కృషి చేస్తున్నట్లు ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు అన్నారు. నరసింహుని దర్శనం అనంతరం ఆదివారం ఉదయం ఆయన కొద్ది సేపు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లక్ష్మీ నరసింహస్వామి దర్శనం చేసుకో వడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. స్వామి వారిని దర్శనం చేసుకుని సనాతన ధర్మ మార్గంలో పయనించాలని ఆయన సూచించారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని స్వామి వారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

నిరంతరం వెలుగుతున్న వీధి దీపాలు

-పట్టించుకోని విద్యుత్ అధికారులు

కోరుట్ల రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం ధర్మారం గ్రామంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో వీధి దీపాలు రాత్రి పగలు తేడా లేకుండా నిరంతరం వెలుగు తున్నాయి. కోరుట్ల మండలం ధర్మారం గ్రామంలో కొన్ని రోజుల క్రితం విద్యుత్ శాఖ అధికారులు పలు వీధుల్లో విద్యుత్ స్తంభాల నుంచి త్రీఫేజ్ లైన్ నిర్మాణం చేశారు. వాటికి బిగించి ఉన్న విద్యుత్ దీపాలకు సరఫరా జరిగి వీధి దీపాలు నిరతరం వెలుగుతున్నాయి. దీంతో గ్రామంలోని పలు వీధుల్లో నిరంతరం లైట్లు వెలగడంతో 30 బల్బ్‌ల వరకు కాలిపోయినట్లు తెలిసింది. గ్రామ పంచాయతీ అధికారులతో పాటు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.



మధ్యాహ్నం వెలుగుతున్న వీధి దీపం

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మార్కెట్ చైర్మన్ రాములుగౌడ్

పెగడపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మండల కేంద్రంలో ఆదివారం మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలందరికి మెరుగైన వైద్య సేవలందించేందుకు గాను సీఎంఆర్ఎఫ్ ద్వారా కోట్లాది రూపాయలు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చెట్ల కిషన్, చాట్ల భాస్కర్, పూసాల తిరుపతి, ఐలేని వంశీధర్ రావు, నీరటి రాజ్ కుమార్, ఎల్లయ్య పాల్గొన్నారు.

●భీమారం: మండలంలోని కమ్మరిపేట గ్రామానికి చెందిన బక్కశెట్టి మల్లేశ్వరికి రూ.45 వేలు, అందె విజయకు రూ.15 వేలు విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండ్ల మధు, అంగ లింగం, బర్కం శేఖర్, అడువాల రాజరెడ్డి, కోటగిరి రాజేశం, అడువాల రాకేష్, బర్కం మల్లారెడ్డి, పడాల రవి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి

●ప్రజలకు సేవతోనే నాయకులకు గుర్తింపు ● జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ ఎంపీటీసీ

రాయికల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ప్రజలకు సేవతోనే నాయకులకు సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలోని లక్ష్మి గార్డెన్‌లో రాయికల్ పట్టణ, మండలానికి చెందిన 35 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.8 లక్షల 50 వేల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితమని, అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని అన్నారు. అందరి సహకారంతో రాయికల్ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నె రాజరెడ్డి, రవీందర్ రావు, కోల శ్రీనివాస్, అచ్యుత రావు, తాజా మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

రాయికల్ పట్టణ అభివృద్ధి పనులపై రాయికల్ పట్టణ మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ పార్క్, అభివృద్ధి పనుల గురించి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బస్సును నడిపించాలని వినతి

రాయికల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణం నుంచి కొత్తపేటకు రాయికల్ మీదుగా రాత్రి 9 గంటల తర్వాత బస్సును నడిపించాలని కోరుతూ ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు మాజీ ఎంపీటీసీ పిప్పోజి మహేందర్ బాబు వినతి పత్రం సమర్పించారు. గతంలో రాత్రి 9 గంటల తర్వాత బస్సు నడిచేదని, దానిని రద్దు చేశారని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి రాత్రి పూట వచ్చిన ప్రయాణికులకు బస్సు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని, వెంటనే బస్సును ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

మృతుడి కుటంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

మల్యాల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్వంతాపూర్‌కు చెందిన తైదల సునీల్ అనే యువకుడు రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకోగా ఆదివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మృతుడి కుటుంబసభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ట్రోఫీ అందజేత

మల్యాల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మల్యాల క్రాస్‌రోడ్డు వద్ద నిర్వహించిన ఎంఎంపీఎల్-4 క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగియగా విజేత జట్టుకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ట్రోఫీ అందజేశారు. విన్నర్ ప్రైజ్‌మనీ అందించి జట్టు సభ్యులను అభినందించారు.

కార్యవర్గం ఎన్నిక

కోరుట్ల రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మండల అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్ను కున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. మండల అధ్యక్షుడిగా వనతడుపుల రమణా చారి, ప్రధాన కార్యదర్శిగా మండలోజు పవన్ కుమార్, కోశాధికారిగా మద్దెలపల్లి భూమయ్య, గౌరవ అధ్యక్షుడుగా విశ్వ నాథుల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా వనతడుపుల నాగరాజు, న్యాయ సలహా దారుడుగా వనతడుపు అరుణ్ కుమార్ చారిలను ఏకగ్రీవంగా సంఘ సభ్యులు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంకోజు లక్ష్మినారాయణ, తెలిపారు. నూతనంగా ఎంపికయిన కార్యవర్గంను రాష్ట్ర అధ్యక్షుడు శివపల్లి రాజేశం, జిల్లా ఉపాధ్య క్షుడు చింతల రాజేశ్వర్ అభినందించి సన్మానించారు.

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడి జన్మదినం

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని వేంపేట గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను అల్లూరి మహేందర్‌రెడ్డితో కట్ చేశారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్ పల్లి శేఖర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ పుల్ల చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు పుల్ల ప్రదీప్ గౌడ్, దశకంఠ రాజు పాల్గొన్నారు.

'మాజీ కౌన్సిలర్ ఇంటి ఎదుట బైఠాయింపు సరికాదు'

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): మొరం అక్రమ వ్యాపారులు కక్ష్యపూరితంగా మాజీ కౌన్సిలర్ ఓజ్జల బుచ్చిరెడ్డి ఇంటి ఎదుట బైఠాయించడం సిగ్గు చేటు అని రైతులు విమర్శించారు. పట్టణ శివారులోని గుండు గుట్ట, మెట్టన్ గుట్టల నుండి అక్రమంగా మొరం తరలించడం వలన చుట్టూ ఉన్న పంట పొలాలు, తోటలు దెబ్బతిని రైతులందరం తీవ్రంగా నష్టపోతున్నామని రైతు సంఘం పెద్దమనుషులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట పొలాలు, తోటల మధ్య నుండి మొరం అక్రమంగా తరలించడం వలన పంటలు దెబ్బతిని నష్టపోతున్నామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆకుల నరేష్, అరిగెల లక్ష్మణ్, జంగిటి వెంకటి, అరిగెల రెడ్డి, జెట్టి పెద్ద నరసయ్య, జెట్టి గంగాధర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1997-98 సంవత్స రంలో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆనాడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులకు స్వాగతం తెలుపుతూ వారిపై పూల వర్షం కురిపించారు. అనం తరం గురువుల పాదాలకు నమస్కరిస్తూ గురువులచే ఆశీ స్సులు తీసుకున్నారు. 29 ఏళ్ల తర్వాత కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని ఉపాధ్యాయులు అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు